క్లుప్తంగా

చెత్త సేకరణపై సీఆర్పీలకు శిక్షణ



చేబ్రోలు: గ్రామీణ ప్రాంతాలలో శాస్త్రీయ, సుస్థిరమైన, వికేంద్రీకృత పద్ధతిలో ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను, బలోపేతం చేసే లక్ష్యంతో సీఆర్పీల ఎంపిక జరిగిందని జిల్లా పంచాయతీ వనరుల కో ఆర్డినేటర్ అనూరాధ అన్నారు. చేబ్రోలులోని చెత్త సంపద కేంద్రంలో శుక్రవారం కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, పొన్నూరు, చేబ్రోలు మండలాలకు చెందిన సీఆర్పీలకు ఎస్‌డబ్ల్యూసీ షెడ్డు నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. క్రియాశీల మహిళలను సీఆర్పీలుగా ఎంపిక చేశామని, గృహ స్థాయిలో ఘన వ్యర్థాల నిర్వహణ ద్వారా ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.ఉషారాణి, డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.

దాసకుటిలో సామూహిక కుంకుమపూజ

తెనాలి: అంగలకుదురు గ్రామంలోని ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాసుస్వామి వారి పరంపర పీఠం దాసకుటిలో 74వ శ్రీమహాలక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన షష్టమ పీఠాధిపతి శ్రీసీతారామ దాసస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న సామూహిక కుంకుమార్చనలో భాగంగా శుక్రవారం శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజ ఎంతో విశేషంగా జరిగింది. 15వ తేదీవరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం మోదమూడి, అంగలకుదురు మొదలగు భక్తుల సహకారంతో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ ఉంటుందని శ్రీసీతారామదాస స్వామి తెలిపారు. ఆదివారం రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం జరుగుతుందన్నారు. 15వ తేదీన మహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకం, హోమ పూర్ణాహుతి జరుగుతాయని, భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

పట్టాల వెంబడి మృతదేహం



తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్ దక్షిణ క్యాబిన్ వద్ద పట్టాల వెంబడి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని రైల్వే సిబ్బంది శుక్రవారం గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని వయసు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని, పట్టాలు దాటే సమయంలో గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని కోరారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం



తెనాలిఅర్బన్: కాశీమాత దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఫిజియోథెరపీ జరుగుతున్న పేద విద్యార్థి జి.నరసింహాస్వామికి రూ.11,000/- ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ మాట్లాడుతూ ప్రతినెల రెండోవ శుక్రవారం పేదలకు అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు యర్రా శ్రీనివాస రావు, ఉమ్మలనేని ధర్మారావు, కందేపి సీతా రామయ్య, నక్కా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అవగాహన ఉండాలి



తెనాలిఅర్బన్: కంటి సమస్యలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని శంకర్ కంటి వైద్యశాల వైద్యులు డాక్టర్ స్వప్న, డాక్టర్ బాషాలు పేర్కొన్నారు. శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్‌లు ఎక్కువగా చూడటం వలన కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. కంటికి సంబంధించిన ఏ సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్నకుమార్, కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజిలిన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దాసరి విజయలక్ష్మి, డాక్టర్ పి.జెన్నమ్మ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఆరంభానికి సిద్ధమైన మురుగునీటి శుద్ధి ప్లాంట్



పైభాగంలో మురుగు శుద్ధి నిర్మాణాలు



చాంబర్లోంచి వెలుపలకి వ్యర్థాలు



మురుగు శుద్ధి ఇలా..

- వైఎస్సార్ సీపీ హయాంలో చకచకా నిర్మాణం
- రోజుకు కోటి లీటర్ల మురుగునీటి శుద్ధి సామర్థ్యం
- ప్రాజెక్టు నిర్మాణానికి రూ.30 కోట్ల వ్యయం
- 4,500 ఎకరాల పంటభూములకు తీరనున్న దాహం



మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లో అధికారుల పరిశీలన

తెనాలి: పట్టణ పూలే కాలనీలో రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్‌టీపీ) ట్రయల్‌రన్ పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది. ఈనెల 14న కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించనున్నారు. రోజుకు కోటి లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యం కలిగిన ఈ భారీ ప్రాజెక్టును వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కేవలం మూడేళ్లలోనే పూర్తిచేశారు. తుది మెరుగులకు కూటమి ప్రభుత్వంలో ఏడాదికి పైగా సమయం తీసుకున్నారు. ఏదేమైనా ఈ ప్రాజెక్టుతో పట్టణంలో పాక్షికంగా మురుగునీటి బెడద తీరటమే కాకుండా, శుద్ధిచేసిన నీటితో నాలుగున్నర వేల ఎకరాల పంటభూములకు సాగునీరు అందించే అవకాశం కలుగుతుంది.

జంపని డ్రెయిన్‌కు అనుసంధానం

స్థానిక రామలింగేశ్వరపేట నుంచి వెళ్లే జంపని డ్రెయిన్‌కు ఈ ప్లాంట్‌ను అనుసంధానం చేశారు. ప్రధాన డ్రెయిన్‌నుంచి మూడు మీటర్ల వెడల్పుతో సిమెంటు కాల్వ, వియర్ సెక్షన్, ఇన్‌లెట్ చాంబర్, సెప్టేజి హోల్డింగ్ ట్యాంక్, మెకానికల్, ఎలక్ట్రికల్, సెన్సార్స్ అన్నీ కలిపిన టెక్నాలజీతో పంప్‌హౌస్, ప్రైమరీ ట్రీట్‌మెంట్ యూనిట్, అమెరికన్ కంపెనీ గ్లైమ్ సరఫరా చేసిన ఎస్‌బీఆర్ బేసిన్స్-2, క్లోరిన్ టోనర్ రూమ్, స్లడ్జి థిక్‌నర్, సెంట్రిఫ్యూజ్ బిల్డింగ్, బ్లోయర్ రూమ్, ప్యానెల్ రూమ్, స్కాడా రూమ్, 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, 500 కేవీ జనరేటర్ యార్డు, లేబొరేటరీతో కూడిన అడ్మినిస్ట్రేషన్ భవనం ఈ ప్రాజెక్టులోని ముఖ్యమైన విభాగాలన్నీ పూర్తయ్యాయి. ప్లాంటు పనితీరులోకి వెళితే, డ్రెయిను లోంచి వచ్చే మురుగునీరు ఇన్‌లెట్ చాంబర్‌తో పంప్‌హౌస్‌లోకి వెళతాయి. 30 మి.మీకు పైబడిన రాళ్లు, ఇతర చెత్తాచెదారం చాంబర్‌లోంచి బయటకు వచ్చేస్తాయి. పంప్‌హౌస్ నుంచి ఎస్‌బీఆర్ బేసిన్స్‌లోకి వె ళ్లాక మురుగునీటి శుద్ధి జరుగుతుంది. తర్వాత లేబొరేటరీలో పరీక్షలు జరిపి, కాలుష్య నియంత్రణ మండలి సూచించిన పరిమితుల ప్రకారం ఉందని నిర్ధారించుకున్నాక సాగునీటి కాల్వలోకి ఈ నీటిని విడుదల చేస్తారు. శుద్ధి చేసే క్రమంలో వచ్చే ఘనవ్యర్థం వేరొక ట్యాంకులోకి వెళుతుంది. ఈ వ్యర్థాన్ని ఎరువుగా నర్సరీలకు మున్సిపాలిటీ విక్రయించొచ్చు. కంప్యూటర్ టెక్నాలజీతో కూడిన స్కాడా రూం నుంచే ఈ యూనిట్‌ను ఆపరేట్ చేస్తారు. నగరాల్లో ఇలాంటి ప్రాజెక్టుల ద్వారా శుద్ధిచేసిన నీటిని గార్డెన్స్‌కు, హోటల్స్‌కు, రైల్వే వాగన్ల శుభ్రతకు సంబంధిత కార్పొరేషన్లు విక్రయిస్తుంటాయి. తెనాలిలో సాగునీటి ఆవశ్యకత ఉన్నందున ఈ నీటిని మున్సిపాలిటీ పంటపొలాలకు విడుదల చేస్తుంది. జోన్-1లో 2048 నాటికి 2.50 లక్షల జనాభా ఉంటుందన్న అంచనాతో రోజుకు కోటి లీటర్ల మురుగునీటి శుద్ధి కోసం ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ప్రస్తుతం రోజుకు 30 లక్షల లీటర్ల మురుగునీరు వస్తున్నాయని అధికారుల అంచనా. మురుగునీటి బెడదతో ఇంతకాలం ఇబ్బందులు పడిన సమీప ప్రాంత రైతులకు ఈ ప్రాజెక్టు ఎంతో ప్రయోజనకరం.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గైడ్‌లైన్స్

పట్టణాల్లో మురుగునీటిని శుద్ధి చేసి తగిన అవసరాలకు వినియోగించాలన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గైడ్‌లైన్స్ ఈ ప్రాజెక్టుకు దారితీశాయి. రాష్ట్రంలోని వివిధ పట్టణాలతోపాటు తెనాలిలోనూ ఈ ప్రాజెక్టుకు అనుమతి లభించింది. పూలే కాలనీలో ఏనాడో మూలనపడ్డ మున్సిపాలిటీ మురుగునీటి శుద్ధి ప్లాంటుకు గల స్థలంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.30 కోట్ల వ్యయంతో ఈ ప్లాంటును చేపట్టారు. పట్టణం నడిబొడ్డులోని పెదరావూరు-వీఎస్సార్ కాలేజీ రోడ్డుకు తూర్పువైపున గల ఏరియా మొత్తాన్ని అంటే పట్టణ సగభాగాన్ని జోన్-1గా విభజించారు. ఆ ప్రాంతంలోని మురుగునీటి శుద్ధి కోసం ఈ ప్లాంటును నిర్మించారు. ముంబయికి చెందిన ఖిలారి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన ఈ ప్లాంట్ నిర్మాణం పనులు కరోనా మహమ్మారి కారణంగా ఆలస్యం జరిగాయి. అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక శ్రద్ధతో 2022-24లో ఈ బారీ ప్రాజెక్టును పూర్తిచేసి, ట్రయల్ రన్‌కు సంసిద్ధం చేశారు. కొత్తగా సిబ్బంది క్వార్టర్స్‌నూ నిర్మించారు.

టీబీ ముక్త భారత్ సాధనలో 'స్వచ్ఛంద' సాయం కీలకం

- ఉద్యమ స్ఫూర్తితో టీబీ రహిత తెనాలి సాకారం చేయాలి
- 'టీబీ ముక్త భారత్' రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

తెనాలి: టీబీ ముక్త భారత్ సాధనలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో ముఖ్యమని ఎక్కడికక్కడ ప్రతి ఊరు టీబీ రహితం కావాలనేది ఉద్యమంగా జరగాలని అప్పుడే త్వరగా లక్ష్యసాధనకు అవకాశం కలుగుతుందని టీబీ ముక్త భారత్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కన్సల్టెంట్ మనోహర్‌రెడ్డి అన్నారు. మానవత, తెనాలి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో 60 మంది హెచ్ఐవీ/ టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. సభకు మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ప్రత్యేకంగా విచ్చేసిన మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ టీబీ రోగులకు న్యూట్రిషన్ ప్రాముఖ్యత గురించి చెబుతూ, కార్యక్రమానికి సహకరిస్తున్న మానవతకు సర్టిఫికెట్‌ను సభాముఖంగా అందజేశారు. ముఖ్యఅతిథి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎంత ధనమున్నది కాదనీ, ఎంత మనసు ఉందనేది ముఖ్యమని, మానవతలోని అందరూ మనసున్నవారని చెప్పారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 2030 నాటికి క్షయనిర్మూలన టీబీ ముక్త భారత్ లక్ష్యమని గుర్తుచేశారు. వ్యాధి ఒకరికి వచ్చినపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేకుంటే ఇతరులకు వ్యాప్తి చెందుతుందని హెచ్చరించారు. వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి, టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఈఎస్ రమాదేవి వివరించారు. పౌష్టికాహార కిట్ల పంపిణీకి సాయం చేసిన మానవత సభ్యులు సాధనాల కోటేశ్వరరావు, గుత్తికొండ లక్ష్మీకాంత రావు, ఈమని సామ్రాజ్యలక్ష్మిని అంతా అభినందించారు. మానవత రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, డాక్టర్ వేముల ప్రియాంక, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మానవత బాధ్యులు ఓంకార్ ప్రసాద్, పి.వెంకట్, మొవ్వా సత్యనారాయణ, సీహెచ్ సాంబశివరావు, అర్జునరావు, ఆలపాటి వెంకట్రామయ్య, ఈఎల్‌వీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు సకాలంలో అందించాలి



తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న కిషోర్‌రెడ్డి

కొల్లిపర: ప్రభుత్వం, అధికారులు సమన్వయంతో ఎటువంటి ఆటంకం లేకుండా వివిధ పంటలకు సకాలంలో తగిన విధంగా సరిపడా పూర్తిస్థాయిలో యూరియా, డీఏపీ మరియు కాంప్లెక్స్ ఎరువులు రైతులకు అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షులు కొండా కిషోర్‌రెడ్డి కోరారు. ఎరువులపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దారు జి.సిద్ధార్థకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ డీలర్లు అధిక రేట్లకు అమ్మకుండా ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించాలని, రాష్ట్రంలో ప్రస్తుతం రైతులకు ఎక్కడ చూసినా యూరియా, డీఏపీ దొరకటం లేదని, ఉన్నా డీలర్లు అధిక రేట్లకు అమ్ముతున్నారు. దీని వలన రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొల్లిపర మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు పండిస్తున్నారని, సాగు చేస్తున్న పంటలకు సరిపడా ఎరువులు సకాలంలో లభించక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎరువులు కోసం సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, ప్రవేటు షాపుల వద్ద గంటలు తరబడి ఎటువంటి సౌకర్యాలు లేకుండా నిలబడి ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. గత ప్రభుత్వంలో ఈ విధమైన ఎరువులు కొరత రాలేదన్నారు. అధిక ధరలకు అమ్ముతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, అధికారులు వెంటనే ప్రభుత్వానికి ఎరువుల పై తగు నివేదిక అందించి ఇప్పటి కైనా ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కొండ బాబు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వంగా సాంబిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భీమవరపు బ్రహ్మానందరెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు వింత వేణుగోపాలరెడ్డి, సభ్యులు కె.విజయకుమార్, జి.వెంకటరెడ్డి, వి.నాగేశ్వరరావు, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువకులపై కేసులా?

- వారికి సంబంధం లేని గొడవ
- విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తాం
- పార్టీ తరఫున పోరాడతాం
- తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



స్థానికుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న శివకుమార్

తెనాలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారనే అక్కసుతో గ్రామంలో జరిగిన గొడవలో కావాలని వైఎస్సార్ సీపీ యువకులను ఇరికించారని, ఇదే రుజువైతే పార్టీ తరఫున పోరాటం చేస్తామని ఆ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హెచ్చరించారు. రూరల్ మండల గ్రామం కొలకలూరులో గణేష్ నిమజ్జనం సందర్భంగా జరిగిన గొడవకు ఏ మాత్రం సంబంధం లేని వైఎస్సార్ సీపీకి యువకులపై పోలీసులు నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారని సమాచారం తెలిసిన వైఎస్సార్ సీపీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శుక్రవారం సాయంత్రం కొలకలూరు గ్రామాన్ని సందర్శించారు. అక్కడి వారిని అడిగి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పేదలపై చూపిన ప్రేమకు కృతజ్ఞతగా స్థానిక యువకులు, వైఎస్సార్ సీపీ వారు కలిసి ఈనెల 2న ఆ మహానేత వర్ధంతిని ఘనంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఆ తర్వాత జరిగిన గణేష్ నిమజ్జనం రోజున గ్రామంలోని దళితవాడలో గొడవ జరిగిందని తెలిపారు. దాడికి, దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే ఆ ఘటనకు ఎలాంటి సంబంధించి పార్టీ యువకుడిని కేసులో ఇరికించారనీ, మరికొందరిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని తెలిసిందని శివకుమార్ అన్నారు. అదే నిజమైతే తీవ్రంగా పరిగణిస్తామని, పార్టీ తరఫున పోరాటం చేస్తామని చెప్పారు. ఇప్పటికే సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లానని చెబుతూ సానుకూలంగా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నట్టు తెలిపారు. గ్రామానికి చెందిన కోడూరి లూకా, పాపారావు మాట్లాడుతూ ఎవరి ఒత్తిడితో ఇదంతా చేస్తున్నారో తెలియాలనీ, హోంమంత్రి, స్థానిక మంత్రి చొరవ తీసుకుని అమాయకులపై కేసులు పెట్టకుండా చూడాలని ఆయన కోరారు.

నేడు తెనాలిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: 11 కె.వి.లైన్ల మరమ్మతులు కారణంగా, విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం తెనాలి పట్టణం, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈఈ బోరుగడ్డ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

నేడు 20 గ్రామాల్లో ..

కొల్లిపర: మండలంలోని 20 గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెండువ శనివారం కావటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ 5 గంటలు పూర్తిగా నిలిపివేయటం జరుగుతుందన్నారు.

అప్రమత్తంగా ఉండండి

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు

తెనాలిఅర్బన్: వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు సూచించారు. పూలేకాలనీలో శుక్రవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ వార్డు ఇస్లాంపేటలో ఒక వ్యక్తికి డెంగీ నిర్ధారణ అయిందని తెలిపారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనులు చేసినట్లు చెప్పారు. దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అదుపు తప్పిన కారు

నాలుగు ద్విచక్రవాహనాలు ధ్వంసం

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి బోల్తాపడిన సమయంలో అక్కడే ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్న ఘటన మండలంలోని వేమవరం అడ్డరోడ్డు వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గుంటూరుకు చెందిన ప్రసాదరావు తన కారులో శ్రీశైలం నుంచి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వేమవరం అడ్డరోడ్డు సమీపంలో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఆ సమయంలో రోడ్డు పక్కన ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలపైకి వెళ్లింది.

15 నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.నాగిరెడ్డి



తెనాలిటౌన్: నియోజకవర్గంలోని పశువులకు ఈ నెల 15వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరుగుతుందని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.నాగిరెడ్డి తెలిపారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని పశువుల ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రతిఏటా రెండుసార్లు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరుగుంతుని చెప్పారు. సెప్టెంబర్ 15వ తేదీ నుండి అక్టోబర్ 15 వరకు నెల రోజుల పాటు ఈ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెదేల్లో ఎక్కువగా గాలి కుటుంబ వ్యాధి సోకుతుందని అన్నారు. తీవ్రమైన జ్వరం, నోటిలో పుండ్లు, కాలి గిట్టల మధ్య పుండ్లు, సొంగకారడం వంటి లక్షణాలు కనపబడతాయని, మేత తినకపోవడం జరుగుతుందని వివరించారు. పాదుగు ఆరిపోయి పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 20 సంవత్సరాల నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి గాలికుంటు నివారణ టీకాలు వేసే ప్రక్రియ శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సూడిపశువులు ఈతకుపోవడం జరుగుతుందన్నారు. ఈ నెల 15 సోమవారం నుంచి రైతుల ఇంటి వద్దకు వెళ్ళి దూడల దగ్గర నుంచి గెదేలకు గాలికుంటు టీకాలు వేస్తామన్నారు. అదే విధంగా బ్రూసెల్లోసిస్ వ్యాధికి జీవితకాలంలో ఒకే టీకా వేస్తామని తెలిపారు. 4 నెలల నుండి 8 నెలల వయస్సు ఉన్న పెయ్యలకు మాత్రమే ఈ టీకా వేయనున్నట్లు చెప్పారు. ఈ వ్యాధి వచ్చినట్లయితే ఆ పాలు త్రాగిన మనుషులకు బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకుతుందని చెప్పారు. గెదేల్లో జబ్బు వస్తే పశువులు ఈసుకుపోయి రైతుకు భారీగా నష్టం కలుగుతుందని తెలిపారు. తీవ్రమైన జ్వరం, వాపు లక్షణాలు, ఈసుకుపోవడం వంటివి ఈ వ్యాధికి ముఖ్యమైన లక్షణాలుగా వివరించారు. తెనాలి నియోజకవర్గంలో 12,628 పశువులు ఉన్నట్లు చెప్పారు. 5 వెటర్నరి హాస్పటల్స్ (కొలకలూరు, పెదరావూరు, అంగకుదురు, గుడివాడ, నందివెలుగు) ఆరు పారా వెటర్నరి డిస్పెన్సరీలు (నందివెలుగు, కంచర్లపాలెం, సంగంజాగర్లమూడి, ఐతానగర్, బుర్రిపాలెం, పినపాడు) రెండు ఆర్ఎస్కేలు, గోపాలమిత్ర ఉండగా వీటన్నింటిలో 15 నుండి పశువులకు గాలికుంటు టీకాలు వేస్తామని అన్నారు. మొబైల వెటర్నరీ వాహనాలు నియోజకవర్గానికి రెండు కేటాయించారని, ఒకటి తెనాలిలో మరొకటి కొల్లిపర మండలంలో తిరుగుతున్నాయి. 1962 నెంబరుకు ఫోన్ చేస్తే రైతుల ముగింటకు వస్తే పశువైద్యాధికారి పశువులకు వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొబైల్ వెటర్నరీ క్లినిక్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించి వ్యాధి బారినుండి రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

క్లస్టర్ విధానంపై సచివాలయ ఉద్యోగుల నిరసన



ఎంపీడీవో దీప్తికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

తెనాలిటౌన్: గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులుగా నియమింపబడ్డ సిబ్బంది ఆత్మగౌరవంతో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో అత్తోట దీప్తికి శుక్రవారం సచివాలయ ఉద్యోగులు మండలపరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గతంలో వలంటీర్‌లుగా పనిచేసిన క్లస్టర్లను సచివాలయ సిబ్బందికి బదలాయించడం, క్లస్టర్‌లో పనిచేయించుకోవడం అనే విధానాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ సర్వేల పేరుతో ఉద్యోగులను ఇబ్బందులు పెడుతున్నట్లు ఆరోపించారు. సెలవుదినాల్లో కూడా సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడం వలన తీవ్రమైన మానసిక ఒత్తిడికి ఉద్యోగులు గురవతున్నట్లు తెలిపారు. సెలవు దినాల్లో ఈ సర్వేల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అదే విధంగా స్పష్టమైన జాబ్ కార్డు అమలు చేయాలని, ప్రమోషన్ ఛానల్ రూపకల్పన, సర్వీస్‌రూల్స్, ఇంక్రిమెంట్స్ వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిధర్‌సింగ్, మహేష్, జి.ప్రవీణ్, డి.మహేష్, రష్మిక, హేమంత్, సాయి, రామకృష్ణ, మేరి, సూర్యకుమారి, నాగమణి, మహాలక్ష్మి, రత్నకుమారి, పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు సహకరించండి

సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న ప్రభాకర్‌రెడ్డి, చంద్రమౌళి

తెనాలిఅర్బన్: దోమల నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చినరావూరుతోట మదర్‌థెరిస్సా నగర్‌లో శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటి ద్వారా దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందన్నారు. దోమలు కుడితే విషజ్వరాలు, మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్ గూన్యా, మెదడువాపు వ్యాధి వంటివి ప్రబలే అవకాశం ఉందన్నారు. పట్టణ సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి పరిసరాలను నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయాలని సూచించారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, మలేరియా సిబ్బంది దీపాల శ్రీనివాసరావు, రషీదు, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

ఎంఈవో లక్ష్మీనారాయణ



విద్యార్థుల డ్రాయింగ్ రోబోట్ ప్రదర్శన



ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలిటౌన్: ఆధునిక సాంకేతికతతో రూపొందించిన డ్రాయింగ్ రోబోట్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుందని మండల విద్యాశాఖాధికారి మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో శుక్రవారం 9వ తరగతి విద్యార్థులు సీఎన్‌సీ డ్రాయింగ్ రోబోట్ ప్రదర్శన నిర్వహించారు. ఎంఈవో లక్ష్మీనారాయణ డ్రాయింగ్ ప్రదర్శనను తిలకించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ ప్రాజెక్టులు విద్యార్థుల సృజనాత్మకతకు, పరిశోధనలకు వినియోగపడతాయని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జేమ్స్ మోర్లే, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి



ఫిరంగిపురం: పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే-డ్రైడేలో భాగంగా పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. తక్కెళ్లపాడులో మలేరియా హెల్త్ అసిస్టెంట్ జె.బాబురావు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రతను వివరించారు. బాబురావు మాట్లాడుతూ ఇంటి యజమానులు నీటి తొట్టిలను నాలుగురోజులకోసారి శుభ్రం చేసుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో పనికిరాని టైర్లు, కొబ్బరిబొండాలు, గాజు సీసాలు, పాత వస్తువులు ఉంటే వాటిలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. సిమెంటు గాబులు, నీటి పీపాలు, కాలువలు పరిశీలించి దోమల లార్వా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఎబెట్ ద్రావణాన్ని చల్లించినట్లు తెలిపారు. జ్వరాలు ఉన్నవారిని గుర్తించి రక్తపూత పరీక్షలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జోస్ఫీనా, ఆశా కార్యకర్తలు ప్రమీలారాణి, వలీవాలు పాల్గొన్నారు.